క్లుప్తంగా

చింతలరాయుడి సన్నిధిలో అసిస్టెంట్ కలెక్టర్



ఆలయంలో శిల్ప సంపదను తిలకిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్

తాడిపత్రి టౌన్ : స్థానిక చింతల వెంకటరమణస్వామి ఆలయాన్ని బుధవారం జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ సందర్శించారు. ఈసందర్భంగా ఆయన అమ్మవారు, స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఆవరణలోని శిల్ప సంపదను తిలకించారు. తహసీల్దార్ మునివేలు, పురావస్తు అధికారి ప్రవీణ్, ఆలయ చైర్మన్ బాణా నాగేశ్వరరెడ్డి, సభ్యుడు సంజన్న పాల్గొన్నారు.

ఘనంగా లింగమయ్య జాతర

శింగనమల: పెద్దమట్లగొంది గ్రామంలో లింగమయ్య స్వామి జాతర బుధవారం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా లింగమయ్య స్వామికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు జంతు బలి ద్వారా మొక్కులు తీర్చుకున్నారు.

క్షయ బాధితులకు పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం అందిస్తున్న ఫయాజ్‌బాషా, బొంబాయి రమేష్‌నాయుడు

యాడికి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం టీబీ రోగులకు ఫయాజ్‌బాషా ట్రస్టు చైర్మన్ ఫయాజ్‌బాషా పౌష్టికాహారం పంపిణీ చేశారు. పీహెచ్‌సీలో 3 నెలల నుంచి టీబీ రోగులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నట్లు ఫయాజ్‌బాషా తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, ఉప సర్పంచ్ చంద్రమోహన్, మండల వైద్యాధికారి శ్రీనివాసులరెడ్డి, ట్రస్ట్ సభ్యులు చవ్వా రాజశేఖర్‌రెడ్డి, గురుప్రసాద్‌రెడ్డి, హాజి, అమర్నాథరెడ్డి, ఎంపీటీసీలు నాగరాజు, రాంమోహన్ పాల్గొన్నారు.

వ్యక్తి మృతి

యాడికి : విద్యుదాఘాతంతో గాయపడి అనంతపురం ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి వివరాల మేరకు.. మండల కేంద్రానికి చెందిన రాజేష్‌కుమార్ (48) భార్య మల్లేశ్వరి, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. రాజేష్ కుమార్ ఇటీవల నిర్మిస్తున్న కొత్త ఇంటి గోడకు నీరు పోస్తూ మంగళవారం విద్యుదాఘాతానికి గురయ్యారు. కుటుంబ సభ్యులు అతడిని అనంతపురంలోని ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించాడు. చికిత్స ఫలించకపోవడంతో బుధవారం తెల్లవారుజామున అక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

భద్రావతి, భావనారుషీశ్వర ఉత్సవాలు ప్రారంభం



స్వామివార్లకు పూజలు చేస్తున్న దృశ్యం

తాడిపత్రి టౌన్: స్థానిక యల్లనూరు రోడ్డు సమీపంలోని మార్కండేయస్వామి ఆలయంలో బుధవారం భద్రావతి భావనారుషీశ్వరుల కల్యాణోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. బహూత్తమ పద్మశాలీయ సంఘం, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారు, స్వామి ఉత్సవ విగ్రహాలకు పట్టు వస్త్రాలు, రంగు,రంగు పూలతో ప్రత్యేకంగా ఆలంకరించి పూజలు నిర్వహించారు బహూత్తమ పద్మశాలీయ సంఘం గౌరవధ్యక్షుడు చెన్నా రాజగోపాల్, జలదుర్గం దామోదర్‌దాస్, అధ్యక్షుడు గడ్డం గణేష్, వైస్ ప్రెసిడెంట్ రంగప్రసాద్, రవికుమార్, సెక్రటరీ శివశంకర్, జాయింట్ సెక్రటరీ పరమేశ్, కోశాధికారి హరికృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

మహిళకు తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన సుబ్బలక్ష్మి

గుత్తి: గుంతకల్లు మండలం గుర్రబాడు గ్రామానికి చెందిన సుబ్బలక్ష్మి అనే మహిళ బుధవారం ఇంటి తలుపు తగలడంతో తీవ్రంగా గాయపడింది. వివరాల్లోకి వెళితే ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఆ సమయంలో సుబ్బలక్ష్మి ఇంటి వాకిట్లో నిలుచునుంది. ఈదురు గాలులకు ఇంటి తలుపు బలంగా సుబ్బలక్ష్మికి తగలడంతో తీవ్రంగా గాయపడింది. తలకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు సుబ్బలక్ష్మిని వెంటనే గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం ఆమెను అనంతపురం సర్వజన ఆసుపత్రికి 108 అంబులెన్స్‌లో తీసుకెళ్లారు.

పేదలకు అండగా నవరత్నాలు

- ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి



నాగసముద్రంలో సంక్షేమ లబ్ధిని చదివి వినిపిస్తున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి



ఏ.కొండాపురంలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

గుంతకల్లు: నవరత్నాలు పేద ప్రజలకు అండగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. నాగసముద్రంలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి నవరత్న పథకాల లబ్ధిపై ప్రజలతో అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే శక్తి సామర్థ్యాలు జగనన్నకే ఉన్నాయన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజల సంక్షేమాన్ని, అభివృద్ధిని విస్మరించిన చంద్రబాబు అక్రమ సందనకు తెరలేపారన్నారు. నీరు–చెట్టు పథకం పేరుతో ప్రభుత్వ సొమ్మును పక్కదారి పట్టించారని ఆరోపించారు. అదే జగనన్న పాలనలో ఏ గ్రామానికెళ్లి చూసినా గ్రామ సచివాయాలు, వైఎస్సార క్లినిక్, రైతు భరోసా కేంద్రాలు దర్శనమిస్తున్నాయన్నారు. నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగలక్ష్మి, ఎంపీటీసీ జయసింహారెడ్డి, వైస్ సర్పంచ్ సుధాకర్, ఎంపీపీ బి.మాధవి, వైస్ ఎంపీపీ సీ.ప్రభావతి, మాజీ ఎంపీటీసీ నరసింహులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు సుంకిరెడ్డి, మండల కన్వీనర్ బి.మోహన్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, గృహసారథుల మండల కన్వీనర్ గోవింద్‌నాయక్, నాయకులు సుంకిరెడ్డి, నరేంద్ర, నరసింహులు, నరేంద్ర, పుల్లయ్య, సోమరెడ్డి, జయరామిరెడ్డి, వినోద్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా అంతకు ముందు ఎమ్మెల్యే వైవీఆర్‌కు నాగసముద్రం గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యేను తొలిత బెలూన్లతో అందంగా అలకరించిన ఎద్దుల బండిపై ఎక్కించి భారీ గజామాలతో సత్కరించి స్వాగతం పలికారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

పుట్లూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. బుధవారం ఏ.కొండాపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. తన సుదీర్ఘ పాదయాత్ర ద్వారా ప్రజల సమస్యలను క్షేత్ర స్థాయిలో తెలుసుకున్న జగనన్న నవరత్నాల పథకాలతో పాటు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ ప్రజల గుండెల్లో నిలిచారన్నారు. సంక్షేమ పథకాల అమలులో, ప్రభుత్వ సేవల్లో ప్రజలకు ఎదురయ్యే సమస్యలను పరిష్కరించడానికి 'జగనన్నకు చెబుదాం' అనే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. 1902 టోల్‌ఫ్రీకి ఫోన్ చేసి ప్రజలు తమ సమస్యలను తెలిపే అవకాశం ప్రభుత్వం కల్పించిందని వివరించారు. ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మంచిని ఓర్వలేని దుష్టచతుష్టయం ఇష్టానుసారంగా అసత్యాలు ప్రచారం చేస్తున్నప్పటికీ ప్రజలు వాటిని నమ్మడం లేదన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా అందజేసిన లబ్ధిని వివరించారు. ఎంపీపీ భూమిరెడ్డి రాఘవరెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మెన్ మూలి వెంకటరామిరెడ్డి, మండల కన్వీనర్ నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కేశవనాయుడు, సుబ్రమణ్యం, కంచెం శ్రీనివాసులరెడ్డి, రాజశేఖర్, నారాయణస్వామి, హరినాథ, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి ప్రజా సంక్షేమ యాత్ర

- వెంకటరెడ్డిపల్లి నుంచి ప్రారంభించనున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి
- తాడిపత్రి మండలంలో 12 రోజుల పాటు సాగనున్న యాత్ర



ప్రజా సంక్షేమ యాత్రలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి (ఫైల్)

తాడిపత్రి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఎన్నడూ లేని విధంగా తాడిపత్రి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో దూసుకుపోయేలా చేయడంతో పాటు ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించడంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సఫలీకృతులయ్యారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా, తాడిపత్రి అభివృద్ధే లక్ష్యంగా పాలన సాగిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి నియోజకవర్గంలోని ప్రజలందరూ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ఎలా సద్వినియోగం చేసుకుంటున్నారో తెలుసుకోవడంతోపాటు వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రజా సంక్షేమ యాత్ర చేస్తున్నారు. ఇప్పటికే రెండు విడతల్లో పెద్దవడుగూరు, పెద్దపప్పూరు మండలాల్లో ప్రజా సంక్షేమ యాత్ర పూర్తి చేశారు. ఆరోగ్యం సహకరించకున్నా ప్రజల కోసం తానున్నానన్న భరోసాను వారికి కల్పించిన ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి 3 విడత ప్రజా సంక్షేమ యాత్రకు శ్రీకారం చుట్టారు. తాడిపత్రి మండలంలో దాదాపు 12 రోజులపాటు 130 కి.మీ దూరం యాత్ర సాగనుంది.

ప్రజా సంక్షేమయాత్ర సాగనుందిలా.....

15న వెంకటరెడ్డిపల్లి, తేళ్లమిట్టపల్లి, గదరగుట్టపల్లి, బుగ్గ, భోగసముద్రం మీదుగా అయ్యవారిపల్లికి చేరుకుంటుంది.
16న అయ్యవారిపల్లి నుంచి అయ్యవారిపల్లి తండా, వెంకటాంపల్లి, తిమ్మేపల్లి, బ్రాహ్మణపల్లి
17న బ్రాహ్మణపల్లి, ఇగుడూరు, గంగాదేవిపల్లి
18 న గంగాదేవిపల్లి నుంచి పులిప్రొద్దుటూరు, చుక్కలూరు, కావేటి సముద్రం
19న కావేటి సముద్రం నుంచి సజ్జలదిన్నె, ఆలూరు
20న ఆలూరు వెలంకూరు, బోడాయిపల్లి, వీరాపురం
22 న వీరాపురం నుంచి హుస్సేనాపురం, బొందలదిన్నె, వంగనూరు
23 న వంగనూరు నుంచి కొండేపల్లి, జంబులపాడు, చల్లవారిపల్లి
24 న చల్లవారిపల్లి నుంచి తిప్పారెడ్డిపల్లి, కొట్టాలపల్లి, కొనగుంటపల్లి, దిగువపల్లి
25న దిగువపల్లి నుంచి ఎగువపల్లి, తేరన్నపల్లి, తిమ్మాపురం, రావి వెంకటాంపల్లి, యర్రగుంటపల్లి
26న యర్రగుంటపల్లి నుంచి చిన్నపల్లి, పెద్దపాడమల, చిన్నపాడమల
మే 27 న చిన్నపాడమల నుంచి తాడిపత్రిలోని నందలపాడు, సీబీ రోడ్డు మీదుగా సాగి గన్నెవారిపల్లి కాలనీ వరకు కొనసాగి, భారీ బహిరంగసభతో ముగియనుంది.

ఎమ్మెల్యేను కలిసిన డీఎస్పీ



ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతికి పుష్పగుచ్ఛం అందిస్తున్న డీఎస్పీ గంగయ్య

పుట్లూరు: ఇటీవల తాడిపత్రి డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన సీఎం గంగయ్య బుధవారం ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఏ.కొండాపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఉన్న ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఆయన వెంట ఎస్‌ఐ వెంకటప్రసాద్ ఉన్నారు.

ప్రశాంతంగా పాలిసెట్

తాడిపత్రి టౌన్: పట్టణంలోని ఏడు పరీక్ష కేంద్రాల్లో బుధవారం జరిగిన ఏపీ పాలిసెట్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పరీక్షకు 1,576 మంది విద్యార్థులు హాజరు కాగా, 166 మంది గైర్హాజైనట్లు ఎంఈఓ నాగరాజు తెలిపారు.

ఇళ్ల నిర్మాణ పనులు షురూ చేయించండి



మాట్లాడుతున్న కమిషనర్ బండి శేషన్న

గుంతకల్లుటౌన్: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకం కింద మొదటి, రెండో విడతల్లో ఇళ్ల మంజూరైనేటికీ పనులు మొదలుపెట్టని వారి చేత నిర్మాణ పనులు షురూ చేయించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సిబ్బందికి సూచించారు. బుధవారం కౌన్సిల్ హాల్‌లో హౌసింగ్ స్పెషలాఫీసర్లు, వార్డు అమినిటీ సెక్రటరీలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఇళ్ల మంజూరైన లబ్ధిదారుల్లో ఎవరైనా ఆప్షన్–3 కింద అర్హత ఉందో వారిని గుర్తించాలని వార్డు కార్యదర్శులను ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల్లో ఉన్న లబ్ధిదారులకు బ్యాంకుల ద్వారా త్వరితగతిన రుణాలిప్పించాలని మెప్మా అధికారులకు సూచించారు. వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయించాలన్నారు. హౌసింగ్ ఈఈ సత్యనారాయణ, మెప్మా టీపీఆర్‌ఓ మోహన్, సీఎంఎం భవాని, మెప్మా సీఓలు పాల్గొన్నారు.

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా ఇళ్లు మంజురైన లబ్ధిదారులు ఇంటి నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దార్ ఉషారాణి పేర్కొన్నారు.బుధవారం కల్లూరు జగనన్న లేఅవుట్‌లో ఇంటి నిర్మాణాలను అధికారులు పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం జగనన్న కాలనీల్లో అన్ని రకాల వసతులు కల్పిస్తోందన్నారు. ఎంపీడీఓ విజయ భాస్కర్, హౌసింగ్ ఏఈ విజయ భాస్కర్ రావు పాల్గొన్నారు.

సదరం క్యాంపు వాయిదా

శింగనమల: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఈనెల 12 వతేదిన జరగాల్సిన సదరం క్యాంపు అనివార్య కారణాల వల్ల వాయిదా పడినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ రమణనాయక్ తెలిపారు. ఈనెల 19న క్యాంపు ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు గమనించాలని కోరారు.

ఆకట్టుకున్న లేగదూడల ప్రదర్శన

గార్లదిన్నె: గుడ్డాలపల్లిలో బుధవారం నిర్వహించిన లేగదూడల ప్రదర్శన ఆకట్టుకుంది. ఈసందర్భంగా డీఎల్‌డీఏ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ సుధాకర్ హాజరై మాట్లాడారు. లింగ నిర్ధారిత వీర్యం వాడడం వల్ల 90 శాతం పెయ్యదూడలు పుడతాయని, 10 శాతం మాత్రమే కుర్ర దూడలు పుట్టే అవకాశం ఉందన్నారు. లింగ నిర్ధారిత వీర్యం ఒక పశువుకు రెండు ఇంజెక్షన్లు మొత్తం రూ.1350, సబ్సిడీ పోను రైతుల వాటాగా రూ.500 చెల్లించాలన్నారు. అనంతరం ఉచితంగా క్యాల్షియం టానిక్, నట్టల నివారణ మందుల పంపిణీ చేశారు. డాక్టర్ రమేష్ రెడ్డి, గోపాలమిత్రలు, పారా సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన శుభవార్త రక్షణ సభలు

పామిడి: స్థానిక హైవేలో హనుమాన్‌లింకురోడ్డు సర్కిల్ సమీపంలో మూడు రోజులుగా శాశ్వత కృపా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అందరికీ శుభవార్త రక్షణ సభలు బుధవారం ముగిసాయి. ఈసందర్భంగా గుంటూరు యూదా మినిస్ట్రీస్ పాస్టర్ నెహమ్యా క్రైస్తవ విశ్వాసులను ఉద్దేశించి ప్రసంగించారు. అంతకుముందు కీర్తనాబృందం ఆలపించిన భక్తిగీతాలు పలువురిని రంజింపజేశాయి. అనంతరం పాస్టర్ నెహమ్యా పలువురి క్షేమం, స్వస్థత, అక్కర్ల కోసం ప్రార్థించారు. నిర్వాహకులు విజయ్‌ఛార్లెస్, ప్రభాకర్, పీటర్ విజయ్, ప్రభాకర్‌ఛార్లెస్, పాస్టర్లు పాల్గొన్నారు.

ప్రతి కూలీకి ఉపాధి పనులు చూపండి

గుత్తి రూరల్: గ్రామాల్లో జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు చూపాలని ఎంపీడీఓ చిత్రా శ్రీనివాసులు ఉపాధి హామీ సిబ్బందిని ఆదేశించారు. ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఏపీఓ మద్దిలేటితో కలిసి మండలంలోని ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి కూలీల సంఖ్య పెంచాలన్నారు. టీఏలు లోకేష్, రత్నాలు, చెన్నారెడ్డి, మైసూరారెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

యల్లనూరు: ఉపాధి పనులు నాణ్యతగా చేపట్టాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కొండన్న తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ జులైలో సామాజిక తనిఖీలు ఉన్నాయని వర్కుఫైల్స్ సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఏపీఓ షబ్బీర్‌బాషా, సిబ్బంది పాల్గొన్నారు

నిత్యావసరాల పంపిణీ

తాడిపత్రి టౌన్: స్థానిక కడప రోడ్డులోని హెచ్‌పీ గ్యాస్ కార్యాలయంలో బుధవారం పట్టణానికి చెందిన ఐదుగురు పేద బుద్ధిమాంధ్యం పిల్లల కుటుంబాలకు హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు ఓబులేసు నిత్యవసలు పంపిణీ చేశారు. విధివంచితులు శీర్షికన సాక్షి దినపత్రిలో ఈ ఏడాది జనవరి 29న ప్రచురితమైంది. ఓబులేసు స్పందించి బాధిత కుటుంబాలకు వరుసగా ఆరు నెలలు నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తానని ప్రకటించారు. ఇందులో భాగంగా వరుసగా నాలుగో నెల నిత్యావసరాలు పంపిణీ చేశారు.

3 వేల క్యూసెక్కుల నీరు విడుదల

పెద్దపప్పూరు: చాగల్లు ప్రాజెక్టు నుంచి దిగువ పెన్నాకు బుధవారం తెల్లవారుజామున 3 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు హెచ్చెల్సీ జేఈ హరి పేర్కొన్నారు. ప్రాజెక్టు ఎగువ ప్రాంతం నుంచి ఇన్‌ఫ్లో ఎక్కువగా ఉండడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నీరు విడుదల చేశామన్నారు. పెన్నానదిలో నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో అశ్వత్థనారాయణ స్వామి దర్శనం కోసం విచ్చేసే భక్తులు నదీలోతట్టు ప్రాంతాల్లోకి వెళ్లకుండా ఏఎస్‌ఐ మహదేవ్ తగు చర్యలు చేపట్టారు.

నేడు ఖత్నా

తాడిపత్రి టౌన్: స్థానిక పుట్లూరు రోడ్డులోని టీటీడీ కల్యాణ మండప సమీపంలోని నూర్‌బాషా దూదేకుల సేవా సంఘ కార్యాలయంలో గురువారం ముస్లిం చిన్నారులకు ఖత్నా కార్యక్రమం జరగనున్నట్లు సంఘం అధ్యక్షుడు నబీరసూల్ ఓ ప్రకటనలో తెలిపారు. 10 వ తరగతిలో 550 మార్కులు సాధించిన దూదేకుల విద్యార్థులు తమ పేర్లను 9573785808 నంబర్‌కు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలన్నారు. వారికి నగదు ప్రోత్సాహక బహుమతి అందిస్తామన్నారు.

12 నుంచి విజయవాడలో శ్రీలక్ష్మీ మహాయజ్ఞం



ఎమ్మెల్యే వైవీఆర్‌ను ఆహ్వానిస్తున్న అధికారులు

గుంతకల్లుటౌన్: రాష్ట్ర దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి 17 తేదీ వరకు విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో శ్రీ లక్ష్మీ మహాయజ్ఞం నిర్వహించనున్నట్లు కసాపురం ఆలయ ఈఓ వెంకటేశ్వరరెడ్డి, శ్రీకోదండరామ స్వామి ఆలయ ఈఓ మఠం మల్లికార్జున తెలిపారు. మహాయజ్ఞంలో పాల్గొనాలని బుధవారం ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డిని ఆయా దేవస్థానాల అధికారులు కలిసి ఆహ్వానించారు. శ్రీలక్ష్మీ మహాయజ్ఞం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఏపీ సీఎం వైఎస్.జగన్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, భక్తాదులు పెద్దసంఖ్యలో హాజరవుతున్నట్లు వారు తెలియజేశారు. కసాపురం ఆలయ ట్రస్ట్‌బోర్డు సభ్యుడు త్యాగరాజు, ఆలయ ఏఈఓ ధనుంజయ, ఉద్యోగులు పాల్గొన్నారు.

రైతులపై మాట్లాడే అర్హత టీడీపీకి లేదు

బుక్కరాయసముద్రం: రైతుల సమస్యలపై మాట్లాడే అర్హత టీడీపీ నాయకులకు లేదని జెడ్పీటీసీ భాస్కర్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వం రైతులకు చేసిన ద్రోహాన్ని ఎవరూ మరచిపోరన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో డ్యాంలు, చెరువులకు నింపి బీడుగా ఉన్న రైతుల పొలాలను పచ్చని పొలాలుగా మార్చారన్నారు. గత ప్రభుత్వంలో రైతులు విత్తనాలు, ఎరువుల కోసం రోజులు పాటు మండల కేంద్రాలలో అన్నం , నీళ్లు లేక వేచి ఉండేవారన్నారు. ప్రస్తుతం ఆర్బీకేల ద్వారా విత్తనాలు, ఎరువులు అందించేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మండలంలో 300 హెక్టార్లకు పైగా పంటలు నష్టం వాటిల్లినట్లు అధికారుల నివేదికల ప్రకారం రూ.69 లక్షలు రైతుల అకౌంట్లలో జమ చేశారన్నారు. గత సీజన్‌లో దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారంగా రూ.39 లక్షలు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు గుర్తు చేశారు. రైతుల సమస్యలపై టీడీపీ నాయకులు ఆందోళనలు చేపట్టడం విడ్డూరంగా ఉందన్నారు.

కమనీయం..చెన్నకేశవుడి కల్యాణం

పెద్దపప్పూరు: కుమ్మెత గ్రామంలో బుధవారం చెన్నకేశవుడి కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. ముందుగా ఆలయంలో స్వామికి ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పట్టువస్త్రాలతో ముస్తాబుచేసి మేళతాళాల నడుమ ఊరేగింపుగా కల్యాణ మండపానికి తీసుకువచ్చారు. వేదమంత్రోచ్ఛారణల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పెద్దపప్పూరు: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. ప్రజాప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

గుత్తి రూరల్: ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకుమండల సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చిత్రా శ్రీనివాసులు, ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

ఉన్నఫళంగా కుప్పకూలి వ్యక్తి మృతి

గుత్తి: నడిరోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న ఓ వ్యక్తి ఉన్నఫళంగా కుప్పకూలి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. గుత్తిలోని కోట వీధికి చెందిన గోవిందు (40)కు భార్య వెంకటలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. రాయలచెరువులోని ఓ గ్రానైట్ పరిశ్రమలో కూలి పనులకు వెళుతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. బుధవారం ఉదయం వ్యక్తిగత పనిపై ఇంటి నుంచి బయటకు వచ్చిన గోవిందు... నడుచుకుంటూ వెళుతూ శిరిడి సాయిబాబా ఆలయం వద్దకు చేరుకోగానే ఉన్నఫళంగా నడిరోడ్డుపై కుప్పకూలాడు. గమనించిన స్థానికులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతిచెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా, గోవిందు మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

గుత్తిలో భారీ వర్షం

గుత్తి: పట్టణంలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారు జాము వరకు భారీ వర్షం కురిసింది. భారీ వర్షానికి ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు తోడు కావడంతో పలు చోట్ల విద్యుత్ స్తంభాలు, వృక్షాలు నేల కూలాయి. చిన్న చిన్న దుకాణాలు, హోటల్లు కూడా దెబ్బతిన్నాయి. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం తలెత్తింది. జనాలు ఇబ్బందులు పడ్డారు. వర్షపాతం 26.7 సెం. మీ. నమోదైంది.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో వస్తువులు దగ్ధం

గుత్తి: స్థానిక బీసీ కాలనీలోని ఓ ఇంటిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో వస్తువులు దగ్ధమయ్యాయి. బాధితుడి వివరాల మేరకు.. కాలనీకి చెందిన రాజా తన కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో నిద్రించాడు. అయితే తెల్లవారు జామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించింది. ప్రమాదాన్ని పసిగట్టిన రాజాతో పాటు కుటుంబ సభ్యులు బయటకు వెళ్లారు. ఇంటిలోని ఫ్రిజ్, కూలర్, ఫ్యాన్లు మరిన్ని విలువైన వస్తువులతో పాటు సుమారు 250 చీరలు కాలిపోయాయి. ఇంటిని విద్యుత్ అధికారులు, పోలీసులు పరిశీలించారు.

సీఎం కప్‌లో విద్యార్థిని ప్రతిభ



మౌనికను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

గుత్తి: తిరుపతిలో నిర్వహించిన సీఎం ఫుట్‌బాల్ కప్‌లో గుత్తి శ్రీసాయి డిగ్రీ కాలేజీ విద్యార్థిని మౌనిక ప్రతిభ చాటింది. ఈమె ప్రతిభతో అనంతపురం ఫుట్‌బాల్ జట్టు రన్నర్స్‌గా నిలిచింది. ఈ సందర్భంగా మౌనికకు శ్రీసాయి డిగ్రీ కాలేజీలో బుధవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మౌనికను ప్రిన్సిపాల్ వెంకటేశ్వర రెడ్డితో పాటు అధ్యాపకులు, విద్యార్థులు, క్రీడాకారులు అభినందించి, సన్మానించారు.సీఈఓ శ్రీరాములు, నిజామ్, ఎంబీఏ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రసన్న కుమార్, పీడీ రవికుమార్ పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ భవనాల ప్రారంభం

యల్లనూరు: మండలంలోని గొడ్డుమర్రిలో నూతనంగా నిర్మించిన సచివాయం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, రైతుభరోసా కేంద్రాలను గురువారం ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి ప్రారంభించనున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి తెలిపారు. అనంతరం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

యాజమాన్య పద్ధతులు పాటించండి

గుత్తి రూరల్: మామిడి రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని ఉద్యానవన శాఖ అధికారిణి మిత్రవింద మాధవి సూచించారు. బుధవారం కరిడికొండ, ఊబిచెర్ల గ్రామాల్లో మామిడి పంటలను హెచ్ఎఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో తోటబడి నిర్వహించి రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఇటీవల అకాల వర్షాలకు మామిడి మొక్కలు దెబ్బతిని ఉంటే తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మామిడి మొక్కలకు పొటాషియం నైట్రేట్ లీటర్‌కు 10 గ్రాములు, అలాగే బొరాక్స్ లీటర్‌కు 1.5 గ్రాములు మొక్కలపై పిచికారీ చేయాలని సూచించారు. ఆర్‌బీకే సిబ్బంది అజయ్, బాలరాజు, వలంటీర్లు పాల్గొన్నారు.